# తమసోమా జ్యోతిర్గమయ

## - శారద



(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

***(జరిగిన కథ - పూర్ణిమా, సీతా ప్రభుత్వ రంగ సంస్థలో సైంటిస్టులు. మానసిక వ్యాధితో బాధ పడుతూన్న స్నేహితుడు అరుణ్ కి చేయూతనిస్తూ అతనితో అనుబంధాన్ని పెంచుకుంటుంది పూర్ణిమ. లేబొరేటరీలో శివరామకృష్ణ సీతకి చికాకు కలగజేస్తూ వుంటాడు. రాజమ్మ కొడుకు అశోక్ ఆత్మహత్యా ప్రయత్నం చేస్తాడు. ఆస్పత్రిలో అశోక్ ని చూసి అరుణ్ తన గురించి తాను ఆలోచించుకుంటాడు. చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడిన ఎస్.ఆర్.కే ని చూసి సీత తన ఆలోచనలనీ, అనవసరపు భయాలనీ సమీక్షించుకుని, తన ప్రవర్తన కొంచెం మార్చుకోవాలన్న నిర్ణయానికొస్తుంది. లలిత్ పైనున్న ప్రేమనీ, అజిత్ తో పెళ్ళినీ, తెంచుకోవాలనుకుంటుంది రూపిణి. ఎక్కడో దూరంగా హాస్టల్లో చదువుకుంటూన్న కూతుర్ని హైదరాబాదు తెచ్చుకుని కాలేజీలో చేర్చే ప్రయత్నం చేస్తుంది. సారిక అనే అందమైన అమ్మాయితో పెళ్ళి నిశ్చయమవుతుంది అరుణ్ కి. అరుణ్ తనకు దూరమవడంతో బాధ పడుతుంది పూర్ణిమ. మనసులో అలజడిని అర్థం చేసుకోవడానికి సైకాలజిస్టు దగ్గరకెళ్తుంది.)***

## 12

"సరే పూర్ణిమా! సాయంత్రం బస్సులో కలుస్తా."

అరుణ్ వంక వింతగా చూస్తూ వెళ్ళిపోయింది సీత.

" రా అరుణ్. కూర్చో!"

" బాగున్నావా పూర్ణిమా? ఎన్నిరోజులయింది నీ కేబిన్లోకొచ్చి!"

"బాగున్నా! నువ్వెలాగున్నావ్? ఇవాళ్టినించేనా ఆఫీసుకి రావడం?"

"అవును. అబ్బ! ఆరేడు నెలలయింది మళ్ళీ ఆఫీసు మొహం చూసి. ఇట్ ఈజ్ గుడ్ టు బి బేక్. అది సరే, సారికతో పెళ్ళి సెటిలయిందని ఈమెయిలు వేస్తే జవాబే ఇవ్వలేదు నువ్వు! నీకు సారిక నచ్చలేదా?" అతను ఆత్రంగా అడుగుతూంటే నవ్వొచ్చింది.

“ఎంత పిచ్చిగా మాట్లాడతావ్ వరుణ్! నా నచ్చడంతో పనేమిటి?నీకు నచ్చింది కదా! అయినా నచ్చకపోవడానికేముంది? ఆ రోజు తర్వాత ఇటు వైపు రాలేదు. పూర్తిగా లేబోరేటరీలోనే వుండి పోయాను. దాంతో ఈ మెయిలు పంప లేకపోయాను. పైగా కొంచెం పని హడావిడి, అంతే! ”

“ అమ్మయ్య! అంతేనా? నీకు సారిక నచ్చలేదేమో నని బలే టెన్షన్ పడ్డాను. ఫోన్ చేద్దామనుకున్నా కానీ, ఈ మధ్య నీకు ఫోన్ చేస్తే నిన్ను డిస్టర్బ్ చేస్తున్నాననిపిస్తుంది. ”

చిన్న పిల్లాడిలా అంటూన్న అతన్ని చూసి నవ్వింది.

“పూర్ణిమా! నిన్న రాత్రి సైకియాట్రిస్టు దగ్గరకి వెళ్ళాను. అబ్బే, ఏం లేదు, రెగ్యులర్ కన్సల్టేషన్. చాలావరకు నేను బాగయిపోయాననీ, ఇంకొక రెండు మూడు నెలల్లో మందులు కూడా మానేసే అవకాశం వుందనీ అన్నాడు.”

“ఈ సంగతంతా సారికకి తెలుసా?”

“తెలుసు! అయినా ఒప్పుకుంది! నాకెంత సంతోషంగా అనిపించిందో చెప్పలేను.”

తనూ మనస్ఫూర్తిగా సంతోషపడడానికి ప్రయత్నించింది పూర్ణిమ.

“గుడ్! ఆమెకి ముందే అంతా చెప్పి మంచి పని చేసావు.”

“అంతే కాదు. తననీ ఒక సారి సైకియాట్రిస్టు దగ్గరికి తీసికెళ్ళమని అడిగింది. ఆయనతో మాట్లాడి నా గురించి అంతా తెలుసుకుంది. చాలా శ్రధ్ధగా అంతా విన్నది. ఈజింట్ షీ ఎ వండర్ ఫుల్ గల్?”

“అఫ్ కోర్స్! ఇక్కడ ఆఫీసులో అంతా ఎలా వుంది?”

“అసలు విషయం చెప్పడమే మర్చిపోయాను! ” తల మీద కొట్టుకున్నాడు.

“నన్ను చెన్నై ట్రాన్స్ఫరు చేసారు. వచ్చే నెలలోగా జాయినవ్వాలి.”

“వాట్!” అదిరిపడింది పూర్ణిమ.

“అవును. ఆ మధ్య ఒకసారి డాక్టరు నాతో స్థలం మార్పు వుంటే నేనేమైనా మారతానేమోనని ట్రాన్స్ఫరు కి అప్లై చేయమన్నారు. చేసి ఆ సంగతే మర్చిపోయాను. కిందటి వారం నాకింకా ఇంట్రస్టు వుంటే అక్కడ ఒక గ్రూపులో నన్ను తీసుకుంటారని చెప్పారు. సారికకీ అక్కడికి మారడం చాలా తేలికట. అందుకని ముందు నేను వెళ్ళి జాయినవుతాను. పెళ్ళి జరిగింతర్వాత సారికా అటొచ్చేస్తుంది.”

“ పెళ్ళెప్పుడంటున్నారు?”

“బహుశా ఆగస్టులో వుండొచ్చు. నువ్వు తప్పక వస్తావుగా?”

“ఎందుకు రాను? ఇంకా ఏమిటి విశేషాలు? అమ్మా నాన్నా అంతా బాగున్నారా?”

“ఏమీ లేవు! పిల్లలెలా వున్నారు? శివా?”

"పిల్లలు ఇవాళో రేపో వచ్చేస్తారు. స్కూళ్ళు కాలేజీలూ తెరుస్తారుగా!"

"మార్కులెలా వొచ్చాయి?"

"బానే వొచ్చాయి కానీ, ఇక ఈ సంవత్సరం నించీ ట్యూషను పెట్టించాలి, తప్పదు."

నవ్వాడు అరుణ్.

"కొన్నిసార్లు నువ్వచ్చం మా అమ్మలా మాట్లాడతావు."

తనూ నవ్వింది పూర్ణిమ.

"సరే, వస్తా పూర్ణిమా. మళ్ళీ మండే నించి ఆఫీసుకొస్తా."

లేచి వెళ్ళాడు.

"అరుణ్!"

వెనక్కి తిరిగాడు.

"ఏమిటి?"

"ఏమీ లేదు. గుడ్ లక్! "

" థాంక్స్! " తీయగా నవ్వి బయటికెళ్ళాడు.

కాసేపు కళ్ళు మూసుకుంది పూర్ణిమ. మనసంతా ఖాళీ అయిపోయిన భావన. "అరుణ్! నీకు సహాయం చేయడానికీ, కష్టకాలంలో నీకు తోడుండడానికీ, నా వ్యక్తిత్వంలోంచీ , జీవితం లోంచీ ఒక భాగాన్ని తీసిచ్చాను. దాన్నంత తేలిగ్గా తీసుకోకు. నన్ను మర్చిపోకు. అన్నిటికంటే ముఖ్యంగా, నీ ఆరోగ్యం శ్రధ్ధగా చూసుకో! మళ్ళీ పాడయితే నేను సహాయం చేయగలనో లేదో!"

చెప్పాలనుకున్న మాటలు చాలాసార్లు అసలు గొంతుదాటి బయటికే రావు.

అయిదు నిముషాల తర్వాత లేచి లేబ్ లోంచి బయటపడింది ఇంటికెళ్ళడానికి.

******************

ఇంటికొచ్చి తాళం తీసున్న తలుపులు చూసి ఆశ్చర్య పోయింది. శివా తలుపు తెరిచాడు నవ్వుతూ.

"అదేంటి? ఇవాళ ఇంత త్వరగా వచ్చేసారే?"

"సర్ప్రైజ్! ఎవరొచ్చారో చూడు!"

"అమ్మా!" గొల్లుమని అరుస్తూ నీహారికా, సంజూ మీద పడ్డారు.

"మీరెప్పుడొచ్చారు?"

"పొద్దున్నే! అసలు ఆదివారం వద్దామనుకున్నాం కానీ, నాన్న నువ్వు డల్ గా వున్నావని ఇవాళే వచ్చేయమన్నారు. బస్టాండుకు నాన్నొచ్చి తీసుకొచ్చారు."

"అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో అంతా బాగున్నారా?"

"అంతా బానే వున్నారు. అమ్మా, షాపింగుకెళ్ళాలి. బట్టలూ, పుస్తకాలూ కొనుక్కోవాలి. వీ హేవ్ టు బి రెడీ ఫర్ స్కూల్!"

పిల్లలు ఉత్సాహంతో గంతులేస్తున్నారు. ఏదో వేరే ప్రపంచానికెళ్ళి తిరిగి తన ప్రపంచంలోకొచ్చినట్టుంది ఆమెకి. ఆ రాత్రి పడుకునేముందు అరుణ్ పెళ్ళీ ట్రాన్స్ఫర్లగురించీ శివాతో చెప్పింది పూర్ణిమ.

"పోనీలే! స్థలం మారీ, పెళ్ళి జరిగీ అతనూ స్థిరపడితే చాలు. ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్!" అన్నాడు శివా.

ఎప్పటికైనా నేను అరుణ్ ని మనసులో నొప్పి లేకుండా తలచుకునే రోజొస్తే అంతే చాలు, అనుకుంది పూర్ణిమ.

జీవితం చాలా పెద్దది. చాలా ప్రేమించిన వాళ్ళనీ, ఆఖరికి కన్న తల్లి దండ్రులనీ పోగొట్టుకుని కూడా తేరుకోగలుగుతాం. అలాటిది, ఏదో ఒక యేడాది స్నేహం చేసిన మనిషిని మరిచిపోవడం పెద్ద సమస్య కాకపోవచ్చు. ఐ జస్ట్ నీడ్ సం టైం, అనుకుంటూ నిద్రపోయింది. ఆ రాత్రంతా కలత నిద్రే మిగిలిందామెకి.

********************

*ఆరు నెలల తర్వాత-*

"ఓ అమ్మా! ఇవాళ సాయంత్రం నేను రాను. అన్ని అంట్లూ రేప్పొద్దునొచ్చి తోమేస్తా!" రాజమ్మ మాటలకి కళ్ళు తెరిచింది పూర్ణిమ.

ఎప్పుడూ లేనిది ఇంతాలస్యంగా లేచింది తను! వామ్మో! ఆఫీసు, వంట. గబుక్కున మంచం దిగి గడియారం చుసి కెవ్వుమంది. ఎనిమిదిన్నర!

"రాజమ్మా! చచ్చేంత లేటయింది. తర్వాత మాట్లాడతా. అసలింత ఆలస్యం అయితే ఎవరూ లేపనన్నా లేదు! నేను లేస్తే కానీ ఈ ఇంట్లో మనుషులు లేవరు. ఇప్పుడు పరిగెత్తాలి బాబోయ్!" బట్టలు వెతుకుతూ అంటోంది పూర్ణిమ.

బుగ్గలు నొక్కుకుంది రాజమ్మ!

"ఏందమ్మా! శనివారం ఆఫీసుందా? సెలవేనని పండుకున్నవనుకున్నా!"

ఇవాళ శనివారమా? హమ్మయ్య! నవ్వేసింది.

"సారీ రాజమ్మా! మర్చిపోయాను. పొద్దున్నే ఎంత చల్లని వార్త చెప్పావు. సారు నిద్ర లేచారా? ఎక్కడున్నారు?"

"కిచెన్లో కాఫీ చేస్తున్నరేమో."

కిచెన్లోకెళ్ళింది పూర్ణిమ. టేబిల్ దగ్గర కూర్చొని పేపర్ చదువుతూ కాఫీ తాగుతున్నాడు శివా.

"నాకేది కాఫీ?"

"గిన్నెలో వుంది పోసుకొని తాగు," తలెత్తకుండానే అన్నాడు. కోపంగా చూసి లేచి వెళ్ళి తన కాఫీ తెచ్చుకుంది.

ఫోన్ మోగింది. రూపిణి.

"పూర్ణిమా! ఇవాళ సాయంత్రం రవీంద్ర భారతిలో ఒక ప్రోగ్రాం కెళ్తున్నాను. వుడ్ యూ లైక్ టు కం? సీత గార్ని కూడా తీసుకురండి. మూడు టిక్కట్లతో నేనక్కడ ఎదురుచూస్తూంటా."

"సీతని కూడా అడిగి, గంట సేపట్లో మళ్ళీ ఫోన్ చేస్తా! సరేనా?"

సాయంత్రం ముగ్గురూ రవీంద్ర భారతి దగ్గర కలుసుకున్నారు.

"సీత గారూ! యూ కుడ్ మేకిట్. నాకు చాలా సంతోషంగా వుంది. పదండి, లోపలికెళ్దాం."

"ఇదిగో, రానంటే ఊర్కోదు పూర్ణిమ. పిల్లలు వాళ్ళ నాన్నతో కలిసి నానమ్మ ఇంటికెళ్ళారు. ఒక్కదాన్నే ఇంట్లో వుండి చేసేదేముందని ఇలా..."

"నువ్వెళ్ళలేదేం మీ అత్తయ్యా వాళ్ళింటికి?"

"నాకు వెళ్దామంటే తలనొప్పి.." నసిగింది సీత.

సీత వంక చూసి ఆమె రహస్యం తెలుసన్నట్టు నవ్వింది పూర్ణిమ. తనూ నవ్వేసింది సీత.

"ఓ,కే! వాళ్ళకీ కొంచెం ప్రైవసీ కావాలేమో కొడుకుతో కబుర్లాడడానికి అని నేను ఆగిపోయాను!" ఈసారి నిజాయితీగా అంది.

"అయినా నువ్వేగా ఈసారి పాట కచేరీకి రాకపోతే వూరుకునేది లేదన్నావ్?"

వాళ్ళ మాటలకి అడ్డొచ్చింది రూపిణి.

"గుడ్ డెసిషన్. పూర్ణిమా, మీ చీర చాలా బాగుంది!"

"మీరిద్దరే నా చీరలు మెచ్చుకోవాలి. మా రాజమ్మయితే నా చీరలసలు మెచ్చనే మెచ్చదు." నవ్వింది పూర్ణిమ.

"రాజమ్మంటే గుర్తొచ్చింది, అశోక్ కాలేజీలో చేరాడా?" రూపిణి వున్నట్టుండి అడిగింది.

"ఆ, చేరాడు. బుద్ధిగా చదువుకుంటాననీ చెప్పాడు."

"అవునూ, అరుణ్ కేదో సమస్య అన్నావా మధ్య. ఏమయింది?"

"ఈ మధ్య అతను కనబడడమే లేదు! " కుతూహలంగా అడిగింది సీత.

"చెప్పాగా, ఏదో పెళ్ళి సంబంధం సమస్యలని. ఇప్పుడా అబ్బాయికి పెళ్ళి కుదిరిపోయింది. చెన్నై వెళ్ళిపోయాడు ట్రాన్స్ఫర్ మీద, అందుకే కనిపించడం లేదు."

"పెళ్ళికూతురెవరు? నీకు తెల్సిన అమ్మాయేనా?"

"ఉష్! తర్వాత మాట్లాడదాం, లోపలికెళదాం పద, ప్రోగ్రాం మొదలవుతోంది."

ముగ్గురూ లోపలికెళ్ళారు, కమ్మగా వినిపిస్తూన్న తంబూరా నాదం లోకి.

***(సమాప్తం)***

Click here to share your comments on this story